నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, ఆదివారం 5 జనవరి 2025 | NIZAMABAD

- నిజాం షుగర్స్ పునరుద్ధరణపై సర్కారు మెలిక
- ఫ్యాక్టరీ తెరిచే బాధ్యతను రైతులపైకి నెట్టిన ప్రభుత్వం
- సాగు ప్రోత్సాహకాలపై స్పష్టత ఇవ్వని వైనం
- మొక్కుబడిగా చెరుకు రైతుల సదస్సు
- రైతులు తక్కువ.. అధికార పార్టీ నేతలే ఎక్కువ
- పునరుద్ధరణ అంశాన్ని పక్కదారి పట్టించేందుకు యత్నాలు
- అనేక అనుమానాలకు తావిచ్చిన నేతల మాటలు



సమావేశంలో పాల్గొన్న రైతులు



సమావేశంలో మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

# చెరుకు పండిస్తేనే ఫ్యాక్టరీ పునరుద్ధరణ

## పది వేలకు పైగా ఎకరాల్లో చెరుకు వేస్తేనే నడపడం సాధ్యం

బోధన్, జనవరి 4: నిజాం షుగర్స్‌ను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చిన రేవంత్ ప్రభుత్వం ఫ్యాక్టరీని తెరిచేందుకు మెలిక పెట్టింది. కనీసం పది వేలకు పైగా ఎకరాల్లో చెరుకు పండిస్తేనే ఫ్యాక్టరీని తెరిచి నడపడం సాధ్యమవుతుందని స్పష్టం చేసింది. ఎడపల్లిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శనివారం నిర్వహించిన చెరుకు రైతుల అవగాహన సదస్సులో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, షుగర్ కేన్ కమిషనర్ మల్సూర్ ఈ మేరకు స్పష్టం చేశారు. ఫ్యాక్టరీని తెరిపిస్తామని, అయితే ముందుగా రైతులు విస్తారంగా చెరుకు పండించాల్సి ఉంటుందని చెప్పడం ద్వారా పరోక్షంగా ఫ్యాక్టరీ పునరుద్ధరణ బాధ్యతను రైతుల పైకి నెట్టేశారు. మరోవైపు, సదస్సుకు ఎంపిక చేసిన కొద్ది మంది రైతులను, అధికార పార్టీకి చెందిన వారిని మాత్రమే ఆహ్వానించి, మిగతా రైతులను పట్టించుకోక పోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి.

### విస్తారంగా పండించాలి..

నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని, అయితే రైతులు చెరుకును విస్తారంగా పండించాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సూచించారు. అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. చెరుకు పండించే విషయంలో రైతులు వాస్తవాలను చెప్పాలని కోరారు. ఈ ఏడాది చెరుకు పంట వేసే కాలం దాటి పోతున్నదని, దీంతో ఈ ఏడాది చెరుకు విత్తనం పంటను 300 నుంచి 400 ఎకరాల్లో వేసే విషయాన్ని రైతులు పరిశీలించాలన్నారు. తర్వాత వచ్చే ఏడాది సీజన్‌లో చెరుకు పంటను విస్తారంగా వేసినట్లయితే, ఆ చెరుకు క్రషింగ్ కోసం నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామన్నారు. ప్రస్తుతానికి పాత యంత్రాలకు మరమ్మతులు చేసి అదే ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ చేస్తామన్నారు. ఒకవేళ చక్కెర రికవరీ తక్కువగా వస్తున్నట్లయితే, పాత ఫ్యాక్టరీకి బదులుగా కొత్త ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు.

### చెరుకు సాగు చేస్తేనే..

నిజాం షుగర్ ఫ్యాక్టరీ బాగా నడవాలంటే కనీసం 16 వేల నుంచి 18 వేల ఎకరాల్లో చెరుకు వేస్తేనే సాధ్యమవుతుందని షుగర్ కేన్ కమిషనర్ మల్సూర్ స్పష్టం చేశారు. బోధన్‌తో పాటు మెట్‌పల్లి, ముంబోజిపల్లి యూనిట్లను తెరిచేందుకు సానుకూలంగా ఉన్నామని తెలిపారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు అవసరమైన చెరుకును సాగు చేసే విషయంలో రైతుల అభిప్రాయాలను తెలుసుకునేందుకే ఈ సదస్సు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తెలిపారు.

### చెల్లింపుల్లో జాప్యంతోనే తగ్గిన సాగు..

చెరుకు రైతులు బాగుంటేనే ఫ్యాక్టరీ నడిచి యాజమాన్యానికి లాభాలు వస్తాయని, ఫ్యాక్టరీ యాజమాన్యం బాగుంటేనే రైతులకు సకాలంలో బిల్లులు ఇవ్వగలదని, ఈ రెండూ పరస్పర ఆధారితాలని బాన్సువాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. గతంలో యాజమాన్యం బిల్లులను సకాలంలో చెల్లించక పోవడంతో రైతులు ఫ్యాక్టరీ చుట్టూ చెప్పులరిగేలా తిరిగారని, తద్వారా క్రమంగా చెరుకు సాగుకు దూరమయ్యారన్నారు.చెరుకులో అధిగ దిగుబడులపై అధ్యయనం కోసం గతంలో రైతులను మహారాష్ట్రకు తీసుకెళ్లిన విషయాన్ని గుర్తు చేశారు. వరి పంటకు ఇస్తున్నట్లు చెరుకుకు కూడా బోనస్ ఇవ్వాలని, తద్వారా సాగు విస్తీర్ణం పెరిగే అవకాశముంటుందని మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు అన్నారు. వరి కంటే చెరుకు సాగు చేయడం ద్వారా రైతులు అధిక ఆదాయాన్ని పొందవచ్చని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి తెలిపారు. చెరుకు సాగు చేయటం ద్వారా నిజాం షుగర్స్‌కు పూర్వ వైభవం తీసుకురావాలని కోరారు.

### వారిదే హడావుడి

వాస్తవానికి చెరుకు రైతుల సదస్సులో రైతుల కంటే అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలే ఎక్కువగా ఉన్నారు. ఎంపిక చేసిన కొందరు రైతులను మాత్రమే సదస్సుకు ఆహ్వానించి, చెరుకు రైతు సంఘాల ప్రతినిధులను విస్మరించారు. చెరుకు పంటను వేయాలని నేతలందరూ చెప్పినప్పటికీ, రైతులకు ఏమేరకు ప్రోత్సాహకాలు ఇస్తారన్నది స్పష్టంగా చెప్పలేదు. చెరుకు పండిస్తే.. ఇచ్చే ప్రోత్సాహకాలు, చెరుకు బిల్లులకు కాలపరిమితి విధించటం వంటి వాటిపై ఊసే ఎత్తలేదు. ఈ నేపథ్యంలోనే.. నిజాం షుగర్స్ పునరుద్ధరణ చేయలేమన్న నిర్ణయానికి వచ్చిన ప్రభుత్వ పెద్దలు రైతులు చెరుకు పండించలేదు కాబట్టే ఫ్యాక్టరీని తెరవలేదంటూ చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నారని రైతులు మండిపడుతున్నారు.

### ఆ వ్యాఖ్యల వెనుక మర్మమేమిటో?

సుదర్శన్‌రెడ్డి చేసిన కొన్ని వ్యాఖ్యలు అనేక అనుమానాలను రేకెత్తించాయి. నిజాం షుగర్ ఫ్యాక్టరీని బోధన్‌లో నడపటం కుదరకపోతే ఇక్కడి నుంచి తరలిస్తామని చేసిన వ్యాఖ్య తీవ్ర చర్చకు దారితీసింది. ఫ్యాక్టరీలో ప్రస్తుతమున్న యంత్రాలకు మరమ్మతులు చేసి నడిపిస్తామని, అప్పటికీ వయేబిలిటీ కాకపోతే తరలిస్తామని అనడం రైతాంగాన్ని ఆందోళనకు గురిచేసింది. మరోవైపు, పది వేల ఎకరాల్లో చెరుకు పండించకపోతే ఫ్యాక్టరీ నడపడం అసాధ్యమనడం ద్వారా ప్రభుత్వ ఉద్దేశమేమిటో బయటపడింది. చక్కెర ఫ్యాక్టరీ నడవాలంటే ముడి సరుకు చెరుకు అవసరం. అయితే, ఏడాదిగా చెరుకు సాగుకు ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడంతో పునరుద్ధరణ విషయంలో సర్కార్‌వి ఉత్తుత్తి మాటలేనన్న విమర్శలున్నాయి. ఈ తరుణంలోనే ఇప్పుడు సదస్సు అంటూ కొత్త నాటకం మొదలెట్టిందని రైతులు మండిపడుతున్నారు.



గోదాములో ఎరువులను పరిశీలిస్తున్న క్లస్టర్ మానిటరింగ్ అధికారి ఆనంద్‌కుమార్

# ఎరువుల కొరతపై అధికారుల ఆరా

### సొసైటీలో స్టాక్ పరిశీలన

ధర్పల్లి, జనవరి 4: నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలంలోని దుబ్బాక సొసైటీ గోదామును అధికారులు శనివారం సందర్శించారు. జిల్లా సహకార అధికారి శ్రీనివాస రావ్ ఆదేశాల మేరకు క్లస్టర్ మానిటరింగ్ ఆఫీసర్ ఆనంద్‌కుమార్ సొసైటీ గోదాము వద్దకు వెళ్లి, యూరియా కొరతపై ఆరా తీశారు. దుబ్బాక సొసైటీ గోదాం వద్ద యూరియా కోసం రైతులు శుక్రవారం బారులు తీరారు. ఖాళీ సంచులు, చెప్పులను క్యూలో ఉంచారు. ఈ విషయమై నమస్తే తెలంగాణ దినపత్రికలో 'యూరియా కొరతపై రైతుల తిప్పలు' అనే కథనం శనివారం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు యూరియా నిల్వలను పరిశీలించినట్లు సమాచారం. మానిటరింగ్ అధికారివెంట సొసైటీ చైర్మన్ చెలిమెల చిన్నారెడ్డి ఉన్నారు.

# లింగంపేట మండలంలో కలకలం

- పిల్లలకు విషమిచ్చి తల్లి ఆత్మహత్యాయత్నం
- ఒక కుమారుడు మృతి, దవాఖానలో తల్లి, మరో కుమారుడు
- హైదరాబాద్‌లో ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి

లింగంపేట, జనవరి 4: కుమారులకు విషమిచ్చి, తల్లి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఉదంతంలో ఓ కుమారుడు మృతి చెందగా, తల్లి, మరో బాబు దవాఖానలో చికిత్స పొందుతున్నారు. హైదరాబాద్‌లో చోటు చేసుకున్న ఈ ఘటన లింగంపేట మండలంలో కలకలం రేపింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. లింగంపేట మండలానికి చెందిన ఓ కుటుంబం నాలుగేండ్ల క్రితం బతుకుదెరువు కోసం హైదరాబాద్ నగరానికి వలస వెళ్లింది. అక్కడ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే, ఏం జరిగిందో ఏమో కానీ నాలుగు రోజుల క్రితం తల్లి తన ఇద్దరు కుమారులకు పురుగుల మందు తాగించి, తాను కూడా సేవించింది. ఇది గమనించిన చుట్టుపక్కల వారు ముగ్గురిని దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న క్రమంలో ఓ కుమారుడు (9) శనివారం ఉదయం మృతి చెందగా.. తల్లి, మరో కుమారుడు ప్రస్తుతం చికిత్స పొందుతున్నట్లు తెలిసింది. ఈ విషయమై కుటుంబ సభ్యులను వివరాలు కోరగా.. వారు వెల్లడించడానికి నిరాకరించారు. కాగా తల్లీ కుమారుల ఆత్మహత్యాయత్నం మండలంలో చర్చనీయాంశంగా మారింది.

# కొనసాగుతున్న హమాలీల సమ్మె




డిచ్‌పల్లిలో అర్ధనగ్న ప్రదర్శన నిర్వహిస్తున్న హమాలీలు

కామారెడ్డి/ డిచ్‌పల్లి/ ఎల్లారెడ్డి రూరల్/ పెద్దకొడప్‌గల్, జనవరి 4: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సివిల్ సప్లయీస్ హమాలీలు చేపడుతున్న సమ్మె శనివారం నాలుగో రోజుకు చేరుకున్నది. ఉమ్మడి జిల్లాలోని కామారెడ్డి, డిచ్‌పల్లి, ఎల్లారెడ్డి, పిట్లంలో హమాలీలు సమ్మెలో పాల్గొన్నారు. కామారెడ్డిలో ఆర్డీవో కార్యాలయం నుంచి కమాన్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. డిచ్‌పల్లిలో అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. పిట్లంలో హమాలీలు చేపడుతున్న సమ్మెకు రేషన్ డీలర్లు మద్దతు తెలిపారు. ఎల్లారెడ్డిలోని ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద హమాలీలు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తంచేశారు. క్వింటాలుకు రూ.29 కూలీ ఇవ్వాలని, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, స్వీపర్లకు రూ.పది లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించేంత వరకూ ఆందోళన కార్యక్రమాలు కొనసాగుతాయని వారు హెచ్చరించారు.




పోచారం ప్రాజెక్టు నీటిని విడుదల చేస్తున్న ఆర్డీవో ప్రభాకర్

# నీటిని పొదుపుగా వాడుకోవాలి

నాగిరెడ్డిపేట, జనవరి 4: పోచారం ప్రాజెక్టు నీటిని రైతులు పొదుపుగా వాడుకోవాలని ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్ అన్నారు. ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోని జోన్ పరిధిలో యాసంగి పంటల కోసం ఇరిగేషన్ ఎస్ఈ విద్యావతి, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి ఆయన శనివారం నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో రైతులు వేసిన నారు మళ్లు ఎండుతున్న విషయాన్ని నమస్తే తెలంగాణ శనివారం ప్రచురించింది. దీంతో అధికారులు స్పందించి నీటిని విడుదల చేశారు. అనంతరం ఎస్ఈ విద్యావతి మాట్లాడుతూ.. ప్రాజెక్టులో 1.6టీఎంసీల నీరు ఉన్నదని, ఏ జోన్ పరిధిలోని 10,500 ఎకరాలకు యాసంగిలో సాగునీరు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ మల్లేశ్, డీఈఈ వెంకటేశ్వర్లు, ఎల్లారెడ్డి ఏఎంసీ చైర్‌పర్సన్ రజిత, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

### టూరిజం ఏర్పాటుకు 12.20 ఎకరాలు కేటాయింపు

పోచారం ప్రాజెక్టు వద్ద టూరిజం ఏర్పాటు కోసం 12.20 ఎకరాల భూమిని కేటాయించినట్లు ఎస్ఈ విద్యావతి అన్నారు. ప్రాజెక్టు వివరాలను డీఈఈ వెంకటేశ్వర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రాజెక్టు దిగువన ఉన్న పెద్ద వాగు వంతెన, ప్రధాన కాలువపై నూతన రహదారి నిర్మాణం కోసం చేపడుతున్న పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ప్రాజెక్టు పాత గెస్ట్‌హౌస్, ప్రాజెక్టు మధ్యలో ఉన్న ఐలాండ్ వద్ద కలిపి 12.20 ఎకరాల భూమిని టూరిజం ఏర్పాటుకు కేటాయించినట్లు తెలిపారు.



# 'ఎమర్జెన్సీ' దోపిడీ

- అంబులెన్సు నిర్వాహకుల ఆగడాలు
- మద్యం తాగి వాహనాలు నడుపుతున్న డ్రైవర్లు
- ప్రైవేట్ హాస్పిటల్స్‌తో ఒప్పందాలు
- అడ్డూ అదుపులేకుండా అద్దె వసూలు
- చితికిపోతున్న రోగులు, బంధువులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

వినాయక్‌నగర్, జనవరి 4: అత్యవసర సమయంలో రోగులను కాపాడడంలో అంబులెన్సుల సేవలు కీలకం. కొన్ని సందర్భాల్లో రోగులను సకాలంలో దవాఖానకు చేర్చి ప్రాణాలను కాపాడుతున్న అంబులెన్సు డ్రైవర్లను కూడా దేవుళ్లుగా భావించే బాధిత కుటుంబాలూ ఉన్నాయి. ఒక విధంగా రోగిని కాపాడడంలో అంబులెన్సు ఒక సంజీవనిగా భావించాల్సిన పరిస్థితి. కానీ జిల్లా కేంద్రంలో కొంతమంది అంబులెన్సు నిర్వాహకులు (డ్రైవర్లు) అక్రమాలకు పాల్పడుతున్నారు. రోగుల బలహీనతను ఆసరాగా చేసుకొని అందిన కాడికి దండుకుంటున్నారు. రోగులను అత్యవసరంగా ఒక చోట నుంచి మరోచోటికి తరలించడానికి బాధిత కుటుంబాలు అంబులెన్సులనే ఆశ్రయిస్తుంటారు. దీనిని ఆసరాగాచేసుకొని కొందరు డ్రైవర్లు తమకు అడ్డు చెప్పేవారు లేరంటూ పేషెంట్ల నుంచి కిరాయి డబ్బులను అందిన కాడికి దండుకుంటున్నారు. బాధిత కుటుంబాలు కష్టాల్లో ఉన్నా కనికరించకుండా వారితో బేరమాడుతున్నారు. అంబులెన్స్ నడిపే డ్రైవర్లలో సైతం చాలా మంది ఎలాంటి నిబంధనలు పాటించడంలేదు. కనీసం యూనిఫాం కూడా ధరించకుండానే వాహనాలను నడుపుతున్నా వారిని నియంత్రించే వారు కరువయ్యారు. మద్యం మత్తులో అంబులెన్సును నడుపుతున్నా వారిని గుర్తించని పరిస్థితి నెలకొన్నది.

### రోగులపై దురుసుగా ప్రవరిస్తున్న వైనం

అంబులెన్స్ నిర్వాహకులు, డ్రైవర్లు కష్టాలో ఉన్న రోగి బంధువులు, కుటుంబ సభ్యులతో దురుసుగా ప్రవర్తించిన సందర్భాలూ ఉన్నాయి. సకాలంలో చికిత్స అందించడానికి రోగిని తీసుకెళ్లాల్సి ఉండగా.. రోగి బంధువులు, కుటుంబ సభ్యులతో కిరాయి పేరిటి సతాయింపులకు దిగుతున్నారు. వారి బాధలు పట్టించుకోకుండా అడ్డగోలు చార్జీలు వసూలు చేస్తున్నారు.

### ఇష్టారీతిన కిరాయి వసూలు

పేషెంట్లకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు హైదరాబాద్ లాంటి పెద్ద నగరాల్లో దవాఖానలకు తరలించేందుకు ఎక్కువ శాతం మంది అంబులెన్సులను ఆశ్రయిస్తుంటారు. ఇందుకు అంబులెన్సు నిర్వాహకులు తమకంటూ ఒక ధరల పట్టిక ఏర్పాటు చేసుకోవాలి. కానీ అలాంటిదేమీలేకుండా ఇష్టారీతిన అందినకాడికి దండుకుంటున్నారు. దవాఖానలకు రోగుల తాకిడి ఎక్కువగా లేని సమయంలో నిజామాబాద్ నుంచి హైదరాబాద్‌కు పేషెంట్‌ను తీసుకెళ్లేందుకు అంబులెన్సు నిర్వాహకులు సుమారు రూ.3 వేల నుంచి రూ. 4వేల వరకు అద్దె తీసుకుంటారు.అదే సీజనల్ వ్యాధులు, అత్యవసర సమయం, రాత్రి వేళల్లో రూ.10 వేలు లేదా అంతకన్నా ఎక్కువ మొత్తంలో డిమాండ్ చేస్తూ వసూలు చేస్తున్నారు.

### దవాఖానలతో లోపాయికారి ఒప్పందం.

కొంతమంది అంబులెన్స్ నిర్వాహకులు పలు దవాఖానలతో లోపాయి కారి ఒప్పందం కుదుర్చుకొని, ఇష్టానుసారంగా అద్దె వసూలు చేసిన ఘటనలు వెలుగుచూశాయి. దవాఖానలో ఆడ్మిట్‌లో ఉన్న పేషెంట్‌ను హైదరాబాద్ తరలించేందుకు సదరు దవాఖానతో ఒప్పందం చేసుకున్న అంబులెన్స్ నిర్వాహకులను మాత్రమే రప్పిస్తున్నారు. వారి ద్వారానే పేషెంట్‌ను ఇతర దవాఖానలకు తరలిస్తున్నారు. ఇలా దవాఖానలతో కుమ్మక్కై రోగుల నుంచి భారీగా దండుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.


### మద్యంమత్తులో డ్రైవింగ్.. రోగుల ప్రాణాలతో చెలగాటం

రోగితో పాటు వారి వెంట ఉండే కుటుంబసభ్యులను తీసుకొని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత కలిగి ఉన్న కొందరు అంబులెన్స్ డ్రైవర్లు వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఎంతో జాగ్రతగా వారిని దవాఖానలకు తరలించాల్సిన కొందరు అంబులెన్సు డ్రైవర్లు మద్యం మత్తులో నడుపుతున్నారు. నెల రోజుల క్రితం ఓ డ్రైవర్ మద్యం తాగి పేషెంట్ లేకుండా అంబులెన్సును నగరంలో నడుపుతూ హంగామా సృష్టించాడు. చివరికి ట్రాఫిక్ పోలీసులకు చిక్కడంతో అంబులెన్సు డ్రైవర్ ఆగడాలు వెలుగుచూశాయి. సదరు డ్రైవర్‌పై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేసి,అంబులెన్స్ వాహనాన్ని సీజ్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు.

### పాత ఎక్విప్‌మెంట్స్‌తో రోగి తరలింపు

జిల్లాలో చాలాకాలంగా అంబులెన్స్‌లు నడుపుతున్న నిర్వాహకులు తమ వాహనాల్లో పాత ఎక్విప్‌మెంట్స్‌నే వినియోగిస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ప్రస్తుతం కొత్త తరహా పరికరాలను వినియోగిస్తూ రోగులను తరలించాల్సి ఉండగా, కొంత మంది మాత్రమే వాటిని ఏర్పాటు చేసుకున్నారు. రోగులకు సేవలు అందించాల్సిన అంబులెన్సు నిర్వాహకులు..వారి బలహీనతను ఆసరాగా చేసుకొని వ్యాపారంగా మార్చడం గమనార్హం.

### ఉచిత అంబులెన్సు స్కీం ఎక్కడ?



అంబులెన్స్ నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తున్నది. పేదలకు ఉచిత అంబులెన్స్ స్కీమ్ ఎక్కడా అమలుకావడం లేదు. ప్రైవేటు అంబులెన్స్ నడిపే డ్రైవర్లు మద్యం తాగడం నేరం. వీరిని పర్యవేక్షించాల్సిన అధికారులు పత్తాలేకుండా పోయారు. అంబులెన్స్‌లపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టి, తనిఖీలు నిర్వహించాలి. నిర్వాహకులు ఇష్టారీతిన రోగుల నుంచి అద్దె వసూలు చేస్తున్నారు. ఇప్పటికైనా అంబులెన్సు డ్రైవర్ల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలి.

- ప్రభాకర్, అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి